క్లుప్తంగా

వైద్యులకు ఎముకల సాంద్రత పరీక్షలు



గుంటూరు మెడికల్: గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జీడీఏఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.వి.నారాయణరావు, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఐ.బాబ్జి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గుంటూరు వైద్య కళాశాలలో వైద్యులు, సిబ్బందికి ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రెండు రోజులపాటు చేసిన పరీక్షల్లో 40 శాతం మంది ఆస్టియోనియా సమస్యతో, 20 శాతం ఆస్టియోపొరాసిస్‌తో బాధపడుతున్నారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నారాయణరావు తెలిపారు. వైద్య శిబిరంలో 50 మంది వైద్యులు, 200 మంది సిబ్బంది, పీజీ వైద్యులు పరీక్షలు చేయించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ గుంటూరు యూనిట్ నేతలు డాక్టర్ భానుకుమార్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ శివగోపాల్, డాక్టర్ సుధారాణి, యూనియన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల యూనియన్ నాయకుడు బాలయ్య మృతి



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వడ్డె బాలయ్య (57) గురువారం మృతి చెందారు. ఆయన జీజీహెచ్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. అనారోగ్యంతో అక్కడే కొద్దిరోజులుగా చికిత్స పొందుతున్నారు. బాలయ్య భౌతికాయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కుల జన గణన తక్షణమే చేపట్టాలి

నెహ్రూనగర్: పార్లమెంట్, అసెంబ్లీ చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది కేవలం అగ్రకుల మహిళా రాజకీయ నాయకత్వం కోసమే గానీ, అణగారిన మహిళల నాయకత్వం కోసం కాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న 33శాతం రిజర్వేషన్‌లో రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యులే ఉన్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా కుల జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ నరేంద్ర మోదీ పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీసీల ద్రోహిగా నరేంద్ర మోదీ చరిత్రలో మిగిలిపోతారని విమర్శించారు. తక్షణమే జనగణన చేసి కులాల జాబితా వివరాలు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

లక్ష్మీపురం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు నేటి వరకు జీతాలు చెల్లించకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షులు బి. లక్ష్మణరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. పవన్, జి. నాగరాజు, కోశాధికారి కె. రాంబాబు గురువారం డిమాండ్ చేశారు. వేతనాలు సరైన సమయంలో అందకపోవడంతో ఈఎంఐలు, ఇతర ఇంటి అవసరాలకు ఖర్చుల నిమిత్తం తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. తక్షణమే వేతనాలతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను కూడా తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

శ్రీవారికి పంచామృతాలతో అభిషేకాలు



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం రెండో రోజు కొనసాగాయి. ప్రాతః కాల ఆరాధన, స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, అలంకార పూజ, సహస్రనామార్చన, విశ్వక్సేన ఆరాధన, ద్వార తోరణాది పూజ, అగ్ని ప్రతిష్ఠ హవనం, ధ్వజ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రధాన, అంతర్గత రోడ్లకు తక్షణం ప్యాచ్ వర్కులు

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన, అంతర్గత రోడ్లకు ప్యాచ్ వర్క్‌లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, ఏఈల వారీగా బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం ఆయన ఏటీ అగ్రహారం, శాంతి నగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు రోడ్లకు ప్యాచ్ వర్కులను చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నూతన రోడ్ల ఏర్పాటుకు ముందే డ్రైయిన్ల నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌ను సందర్శించారు. పారిశుద్ధ్య పనులకు అవసరమైన పారలు, దంతేలు, బిన్లను వార్డుల వారీగా డిమాండ్‌కి తగిన విధంగా తెప్పించామని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వాటిని తీసుకెళ్లి వార్డుల్లో మరింత మెరుగైన పారిశుద్ధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బాలాజీ నగర్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. శివారు ప్రాంతాల్లో డ్రైయిన్ల ఏర్పాటుపై ఇంజినీరింగ్ అధికారులు, పారిశుద్ధ్య పనులపై ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఏటీ అగ్రహారంలో తాగునీటి శాంపిల్ తీసి క్లోరిన్ శాతాన్ని తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఎమినిటీ కార్యదర్శులు సరఫరా సమయంలో శాంపిల్ తీయాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ మధుసూదన్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

జాతీయ రహదారి వెంట వ్యర్థాల తొలగింపు

జాతీయ రహదారి వెంబడి వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ ఆదేశాల మేరకు బయాలజిస్ట్ రామారావు నేతృత్వంలో కాకాని జంక్షన్ నుంచి బుడంపాడు జంక్షన్ వరకు కార్మికులు జాతీయ రహదారి వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించారు. జాతీయ రహదారి వెంబడి వ్యర్థాలు గుట్టలుగా ఉంటున్నాయని, రాత్రి సమయాల్లో వేసే వారిని గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. వ్యర్థాలకు కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టడం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని చెప్పారు. రహదారి వెంబడి వ్యర్థాలను వేయకుండా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అన్న క్యాంటీన్లలో గ్రీనరీ, పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

అన్న క్యాంటీన్లలో గ్రీనరీ, పరిశుభ్రత ఉండేలా అక్షయ పాత్ర, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం పల్నాడు బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. పల్నాడు బస్టాండ్ దగ్గరలోని క్యాంటీన్ వద్ద వారం రోజుల్లో ఉన్న ఫ్లోర్ మరమ్మతులు పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు. పరిసరాల్లో ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని చెప్పారు. ప్రజలు కూడా క్యాంటీన్‌లో అందే ఆహారంపై తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయవచ్చని కమిషనర్ సూచించారు.

మహిళలను గౌరవించే చోట దేవతల కొలువు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



మహిళా ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఇటీవల జెడ్పీ ఆవరణలో మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం జరిగిన బహుమతి ప్రదానోత్స సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘ నాయకుడు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు అధ్యక్షత వహించిన సభలో హెనీ క్రిస్టినా మాట్లాడారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అన్ని రంగాల్లోనూ వారు ఎదగటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు, ఓటు హక్కు కల్పించిన అంబేడ్కర్ మహానుభావుడని కొనియాడారు. జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు మాట్లాడుతూ పార్లమెంటు, శాసనసభల్లో మహిళలకు సీట్లను పెంచాలన్నారు. పంచాయతీరాజ్ జిల్లా కో–ఆర్డినేటర్ పద్మారాణి మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో మహిళలు ముందుకు సాగాలని సూచించారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం కావాలని తెలిపారు. డెప్యూటీ సీఈఓ సీహెచ్.కృష్ణ, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్ మాట్లాడుతూ సమాజంలో ఇంకా మార్పు రావాలని, మహిళలను ప్రోత్సహించి వారి ఎదుగుదలకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆటలు పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు.


టెన్త్ విద్యార్థినులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ



ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ప్రొఫెసర్ కొండలరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎస్టీయూ నగర శాఖ, బీఆర్ అకాడమీ డైరెక్టర్ రావి భువనేశ్వరి సంయుక్తంగా ప్రభుత్వ, జెడ్పీ, నగరపాలకసంస్థ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న మూడు వేల మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేసినట్లు ఎస్టీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. వెంకయ్య, యు.మహంకాళిరావు తెలిపారు. గురువారం అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ ఎయిడెడ్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నగర ఆర్థిక కార్యదర్శి సీహెచ్. జై సుందర్ కుమార్, సెయింట్ ఇగ్నేషియస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మరియారాణి, ఏఎన్‌యూ ప్రొఫెసర్ డి. కొండలరావు, ఎయిడెడ్ హిందీ ఉపాధ్యాయులు షేక్ షావలి, నగరపాలకసంస్థ ఉపాధ్యాయులు కె. లీలా కోటేశ్వరరావు, బి.మధు, పి.లక్ష్మీనారాయణ, పి.మహేష్, ఏ.సురేష్, బీఆర్ అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలి



జెడ్పీ సీఈవో జ్యోతిబసుకు సమస్యలు వివరిస్తున్న ఎంఈవోలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో 2023 జూన్ 16 నుంచి పని చేస్తున్న 18 మంది ఎంఈవో–2 వేతనాల నుంచి మినహాయించిన నిధులను జెడ్పీ పీఎఫ్ ఖాతాలకు జమ చేయాలని ఏపీ మండల విద్యాశాఖాధికారుల (ఎంఈవో–2) సంఘ అమరావతి శాఖ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసును జెడ్పీ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీవీ రామకృష్ణ, ఆర్. సుబ్బారావు మాట్లాడుతూ ఎంఈవో–2 వేతనాల నుంచి మినహాయిస్తున్న నిధులు ఇప్పటి వరకు జెడ్పీ పీఎఫ్ ఖాతాల్లో జమ చేయలేదని తెలిపారు. డెప్యూటీ సీఈవోతో పాటు సూపరింటెండెంట్‌కు అనేక మార్లు తెలియజేసినప్పటికీ ప్రయోజనం లేదని సీఈవో దృష్టికి తెచ్చారు. ఎంఈవోల్లో పలువురు త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్నట్లు చెప్పారు. పిల్లల వివాహాలు, ఇతరత్రా ఖర్చుల కోసం రుణం పొందేందుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పీఎఫ్ ఖాతా అప్‌డేట్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఈవోను కలిసిన వారిలో పలువురు ఎంఈవోలు ఉన్నారు.

అక్మే స్కూల్ డైరెక్టర్‌కు అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు రూరల్ పొత్తూరులోని అక్మే స్కూల్ డైరెక్టర్ నందమూరి దీప్తి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు–2025 అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ నందమూరి సొగంధ్‌కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై ఐఐటీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె అందుకున్నట్లు పేర్కొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శరత్‌చంద్ర

గుంటూరు మెడికల్: సైలెంట్ కిల్లర్‌గా వ్యాపిస్తున్న కిడ్నీ సంబంధ వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కిమ్స్ హాస్పిటల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్ డాక్టర్ వి.శరత్‌చంద్ర సూచించారు. తరచూ కిడ్నీ వైద్య సంబంధ పరీక్షలు చేయించుకోవడం, ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించడం వల్ల క్రానిక్ కిడ్నీ జబ్బుల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని చెప్పారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం మంగళదాస్‌నగర్ లోని కిమ్స్ హాస్పిటల్లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో డాక్టర్ వి శరత్ చంద్ర, యూరాలజిస్ట్ డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్ అవగాహన కల్పించారు. నేడు పది మందిలో ఒకరు దీర్ఘకాలిక కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. మన దేశంలో 10 లక్షల మందిలో 800 మంది కిడ్నీ జబ్బులతో బాధపడుతున్నారని వెల్లడించారు. కిడ్నీలను కాపాడడమే ధ్యేయంగా గుంటూరు కిమ్స్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. వంద మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. జీఆర్‌బీఎస్, సీరం క్రియాటిన్, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ పరీక్షలు నిర్వహించి నెఫ్రాలజీ, యూరాలజీ డాక్టర్ల కన్సల్టెన్సీ సేవలను ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు.

పరీక్షలంటే భయం, ఆందోళన వద్దు

ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు



విద్యార్థినికి హాల్ టికెట్ అందజేస్తున్న అద్దంకి శ్రీధర్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పబ్లిక్ పరీక్షల పేరుతో విద్యార్థులు అర్థం లేని భయం, ఆందోళనకు గురికావద్దని సీనియర్ ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో గురువారం టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు పరీక్ష సమయంలో ఒత్తిడిని అధిగమించి, ప్రశాంత వాతావరణంలో రాసేందుకు సూచనలు చేశారు. ఏడాది పొడవునా పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదివిన విద్యార్థులు చదివిన అంశాలను చక్కగా ప్రజెంట్ చేసే వేదికగా పబ్లిక్ పరీక్షలను ఉపయోగించుకోవాలని తెలిపారు. పరీక్షల పేరుతో అనవసరమైన ఆందోళన వద్దని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలో టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఎదుర్కోవాల్సిందేనని, అందుకు మానసికంగా సన్నద్ధం కావాలని సూచించారు. సమయ సద్వినియోగం, పాజిటివ్ ఆలోచనలు, మంచి ఆహారం, తగినంత నిద్ర, సబ్జెక్టుల వారీగా చదువుకోవడం వంటి అంశాలు పరీక్షల్లో మంచి విజయానికి దోహదం చేస్తాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో అనకు ఎదురైన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు, ఎగ్జామ్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి అందజేస్తున్న కోమరే బేగం, జయప్రకాష్, బుల్లిబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: నందివెలుగు రోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ బాలుర పాఠశాల నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్, గుంటూరుకు చెందిన నవీన్ టైలర్స్ నిర్వాహకుడు నజీర్ సహకారంతో గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు కోమరే బేగం మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, ఉన్నతమైన స్థితికి చేరుకునేందుకు చదువు ఒక్కటే మార్గమని సూచించారు. ఆత్మవిశ్వాసమే కొండంత బలంగా, క్రమశిక్షణతో కూడిన ప్రయత్నం మంచి విజయాలను అందిస్తుందని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ జయప్రకాష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో విద్య చాలా ప్రాముఖ్యమైనదని తెలిపారు. మనిషి స్థితిగతులను మార్చేది విద్యని అన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ఉపాధ్యాయులు రిబ్బానీ సిరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలు



ల్యాబ్ టెక్నీషియన్‌లతో విశ్వనాథ్, కుసుమ

గుంటూరు మెడికల్: నగరంలోని కొత్తపేటలో (యడవల్లి వారి సత్రం పక్కన) గత 78 సంవత్సరాలుగా రోగులకు, వైద్యులకు సేవలందిస్తున్న నేషనల్ ఎక్సరే, ల్యాబ్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 'ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థలో పని చేస్తున్న సీనియర్ టెక్నీషయన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని నేషనల్ ఎక్సరే అధినేత బి.వి.ఎస్.కె.విశ్వనాథ్, కుసుమ విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సేవే పరమార్థంగా, అతి తక్కువ ఫీజులతో తమ ల్యాబ్ పని చేస్తున్నట్లు వెల్లడించారు. గత 30 ఏళ్లుగా సేవలు అందిస్తున్న ఎస్.లక్ష్మణ్ కుమార్, కె.రాణి, ఎస్.రాంబాబులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ వెంకటకృష్ణ మాదల, చిలుమూరు ఫణి, సిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలకు చిరునామాగా ఎన్నికల సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్లేషకులు ప్రసాదరావు

లక్ష్మీపురం: అవకతవకలకు చిరునామాగా మారిన కేంద్ర ఎన్నికల సంఘంపై పార్లమెంట్ ఉభయసభల్లో దద్దరిల్లినా సమాధానం చెప్పకుండా దాటవేస్తున్న తీరు సిగ్గుపడాల్సిన విషయమని విశ్లేషకులు ముప్పాళ్ల ప్రసాదరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన చర్చలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ సంస్థగా ఎంతో హుందాగా, నియమ నిబంధనలకు లోబడి పని చేయాల్సిన ఎన్నికల సంఘం అడుగడుగునా లోపాయికారి వ్యవహారాలతో ఎన్నికలు జరిపిస్తుందన్న ఆరోపణలు అనేక రాష్ట్రాల నుంచి వస్తున్నాయని తెలిపారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఎన్నికల నిర్వహణ ఈ మధ్యకాలంలో నవ్వుల పాలవుతున్నా, తనకేం సంబంధం లేనట్లు ఎన్నికల కమిషన్ ప్రవర్తిస్తోందని విమర్శించారు. మహారాష్ట్రలో ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ ఆరోపణలు చేసి మూడు నెలలైనా సమాధానాన్ని ఎన్నికల కమిషన్ ఇవ్వలేదని తెలిపారు. సీనియర్ అధ్యాపకులు ఆర్.రామచంద్రరావు, న్యాయవాది అవధానుల హరి ప్రసంగించారు.

అధికారంలోకి రావడానికి నిరంతరం కృషి

కాంగ్రెస్ రాష్ట్ర ప్రొఫెషనల్స్ హెడ్ భార్గవ్



సమావేశంలో మాట్లాడుతున్న భార్గవ్

లక్ష్మీపురం: రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి నిరంతరం కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ అన్నారు. ఆయన గురువారం గుంటూరు వచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలక విజయ కుమార్, మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, బిళ్లా సునీల్ తదితరులు ఘన స్వాగతం పలికారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భార్గవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ, రాష్ట్ర అధ్యక్షులు అప్పగించిన బాధ్యతకు పూర్తి న్యాయం చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చేందుకు ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చిందని విమర్శించారు. ఎన్నికల ముందు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గడ్డం విజయకుమార్, రాచకొండ జాన్‌బాబు, జొన్నాల వెంకటరెడ్డి, తవిశెట్టి మోహన్‌రావు, బొట్ల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

స్కౌట్స్‌తో దేశభక్తి, సేవాభావం

కాకుమాను: స్కౌట్స్‌తో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు దేశభక్తి, సేవాభావం అలవడుతుందని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను జిల్లా సమన్వయకర్త ఎం.ఏడుకొండలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాణించిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులంతా కష్టపడి నేర్చుకోవాలని ఆయన సూచించారు. స్కౌట్స్ జిల్లా శిక్షణ కమిషనర్ నరేష్ విద్యార్థులకు గైడ్స్ నియమనిబంధనల గురించి వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.సత్యం, ఉమాదేవి, శ్యామలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి సర్కారు కక్షపూరిత చర్యలు

మాజీ మంత్రి అంబటి రాంబాబు

నగరంపాలెం(గుంటూరు పశ్చిమ): సినీనటుడు, రచయిత పోసాని కృష్ణమురళిపై ఇప్పటివరకు 17 కేసులు నమోదు చేశారని, ఆయనపై నమోదైన కేసుల్లో ఏ ఒక్కటీ నిరూపణ కాలేదని, సాక్ష్యాధారాలు లేవని ఇదంతా కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా చేస్తోందని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు జిల్లా జైలులో ఉన్న సినీనటుడు, రచయిత పోసాని కృష్ణమురళిని గురువారం మధ్యాహ్నం ములాఖత్ ద్వారా మాజీ మంత్రి అంబటి రాంబాబు పరామర్శించారు. అనంతరం మీడియాతో అంబటి మాట్లాడుతూ పోసాని కృష్ణమురళిగానీ సోషల్ మీడియా యాక్టివిస్టులుగానీ ఆర్గనైజింగ్ క్రైం చేయలేదని స్పష్టం చేశారు. ఆర్గనైజింగ్ క్రైం ఆంధ్రా పోలీసులే చేస్తున్నారని విమర్శించారు. పోసానిపై నమోదు చేసిన కేసుల్లో పోలీసులు పీటీ వారెంట్‌లను తీసుకుని కర్నూలు, గుంటూరు, విజయవాడ అంటూ 67 ఏళ్ల పోసానిని అక్కడ ఇక్కడ తిప్పి, వేధిస్తున్నారని, పోసానిని భయపెట్టాలని లోకేష్ చూస్తున్నారని ఆరోపించారు. దీన్ని వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తొమ్మిది నెలల్లోనే కూటమిపై వ్యతిరేకత పెరిగిందన్నారు.

విజయసాయిరెడ్డే కోటరీ..

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డే కోటరీ అని, ఆయనే వెళ్లిపోయాక ఇబ్బందిలేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన పైవిధంగా స్పందించారు.

సృజనాత్మకతతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏఎన్‌యూ కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగ డీన్ ఆచార్య ఆర్. శివరామ్ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో 'సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు – అంకుర పరిశ్రమలు – గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో వీటి పాత్ర 'అనే అంశంపై ఎంబీఏ విభాగ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తెలిపారు. గ్రామాలను దత్తత తీసుకుని, వాటి అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచించారు. అనంతరం పరిశోధన పత్రాలు సమర్పించిన అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ రమేష్, ప్రిన్సిపాల్ ఎస్.అనితాదేవి, ఎంబీఏ విభాగాధిపతి ఉప్పు రవికుమార్, శ్రీనివాసరావు, జేవీ సుధీర్ కుమార్, నిర్మల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.